సింహగిరిపై ఘనంగా ఏకాదశి తిరువీధి

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ఏకాదశి తిరువీధి వైభవంగా జరిగింది. ఆలయంలో కొలువుదీరిన మదనగోపాలస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సాయంత్రం బేడామండపంలో తిరువీధి నిర్వహించారు.



ప్రజల గొంతుకై ప్రశ్నిస్తాం

- హామీలన్నీ అమలు చేసేవరకు పేదలకు అండగా నిలబడతాం
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను

తగరపువలస: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు ప్రజల గొంతుకై ప్రశ్నిస్తూనే ఉంటామని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పేదలకు అండగా నిలబడతామన్నారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం తర్లువాడలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ 14 నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.1000 పెన్షన్ పెంపు తప్ప సూపర్‌సిక్స్‌లో మరే పథకం పూర్తిగా అమలు చేయలేకపోయిందన్నారు. ఆడబిడ్డలకు ఇస్తామన్న నెలకు రూ.1500 కోసం రాష్ట్రాన్ని అమ్మాలని బీద అరుపులు అరుస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు రూ.13వేలు మాత్రమే ఇచ్చి ఇంకా 30 లక్షల మందికి ఎగ్గొట్టారన్నారు. నిరుద్యోగ భృతి రూ.3వేలు, 20 లక్షల ఉద్యోగాల ఊసే లేదన్నారు. ఉచిత బస్సు విషయంలోనూ షరతులు పెడుతున్నారన్నారు. రైతు భరోసా ద్వారా వైఎస్ జగన్ ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అయిదేళ్లూ అమలు చేస్తే.. కూటమి ప్రభుత్వం కేంద్రం సాయం లేకుండా ఏటా రూ.20వేలు ఇస్తామని, ఇప్పుడు గతేడాది సాయం ఇవ్వకుండా పాక్షికంగా రూ.5వేలు ఇచ్చారన్నారు. 7 లక్షల మందికి పూర్తి సాయం అందలేదన్నారు. గతంలో నవరత్నాలు అమలు చేసేముందు అన్న వస్తున్నాడు అని ముందుగా చెప్పడమే కాకుండా తూచ తప్పకుండా చెప్పిన ప్రకారం అన్ని పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌దే అన్నారు.


సభకు హాజరైన తర్లువాడ ప్రజలు

చంద్రబాబు పాలనలో రైతులకు కన్నీళ్లే..

మన ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో పుష్కలంగా పంటలు పండటమే కాకుండా విత్తనాలు, యూరియా, ఎరువులు సకాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు చేరేవన్నారు. ప్రస్తుతం ఆగస్టు మొదటి వారంలో కూడా మలమలమాడే ఎండలు రైతులను ఏడిపిస్తున్నాయన్నారు. చంద్రబాబు పాలనలో ఎప్పుడూ రైతులకు కన్నీళ్లే అన్నారు. మన ప్రభుత్వం ఉన్నప్పుడు కేజీహెచ్‌లో రోజుకు 50 నుంచి 60 వరకు శస్త్రచికిత్సలు జరిగేవని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మందులు, శస్త్రచికిత్స పరికరాలు లేక రోజుకు ఒక్క శస్త్ర చికిత్స కూడా జరగడం లేదన్నారు. చంద్రబాబు చేసిన అభివృద్ధి కేవలం పత్రికలు, టీవీల్లోనే కనిపిస్తుందన్నారు. ఈ 14 నెలల కాలంలో రూ.1.75 లక్షల కోట్లు అప్పు చేసిన ప్రభుత్వం అమరావతికి, తమకు కావలసిన వారికి మళ్లించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంద్రెడ్డి శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు బొట్ట రామకృష్ణ, పాండ్రంగి శ్రీను, పాండ్రంగి అప్పారావు, బోని అప్పలనాయుడు, కోరాడ ఆదినారాయణ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలిమి గంగరాజు, పల్ల రమణ, బంక శ్రీను, షిణగం అప్పలరాజు, బంక కృష్ణంనాయుడు, కోరాడ వెంకట రమణారావు, బలిరెడ్డి మహేష్, కోన శ్రీను, చందక సూరిబాబు, షిణగం దామోదరరావు, బావిశెట్టి రాజు, లెంక రాంబాబు, డోల ఆనంద్, కర్రి నాయుడుబాబు, తొమురోతు సత్యం, గుసిడి ముత్యాలు, గంటా జగదీష్, బోని సన్యాసినాయుడు, విజినిగిరి అప్పలనాయుడు, కాళ్ల గౌరి, ఇల్లపు వెంకట్, షిణగం రాంబాబు, ఉప్పాడ సూర్రెడ్డి, రౌతు శ్రీను, తెడ్లాపు గోవింద్, ముసలినాయుడు, కోండ్రు శంకర్, రెల్లి సూరిబాబు, చెల్లూరి కృష్ణ, పలపాల రమణ, పిల్లా అప్పలనాయుడు, మజ్జి శ్రీను, మరుపల్లి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


తర్లువాడ సభలో క్యూఆర్ కోడ్ చూపిస్తూ మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు





నిబంధనల ప్రకారమే భవన నిర్మాణాలు


జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

మధురవాడ: నిబంధనల ప్రకారమే భవన నిర్మాణాలు జరిగేలా నిర్మాణదారులకు అవగాహన కల్పించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. జీవీఎంసీ జోన్–2 మధురవాడ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్, ప్రజారోగ్యం తదితర విభాగాలు వారీగా మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిబంధనలు ప్రకారమే నిర్మాణాలు జరిగితే పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులే రావని పేర్కొన్నారు. జీవీఎంసీ స్థలాలను గుర్తించి అన్యాక్రాంతం కాకుండా చూడాలని, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ప్లానింగ్ సెక్రటరీ శ్రద్ధతో విధులు నిర్వర్తించాలన్నారు. మెకానికల్ విభాగం నుంచి పారిశుధ్య కార్మికులకు పుష్ కార్డుల పంపిణీ ఏవిధంగా చేస్తున్నారని ఆరా తీశారు. రెవెన్యూ అధికారులు, అడ్మిన్ సెక్రటరీలు కొత్త అసెస్మెంట్లు గుర్తించి పన్నులు పరిధిలోకి తీసుకురావడంతో పాటు నిత్యం వార్డులో పర్యటించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు కేటాయించిన టిడ్కో ఇళ్లల్లో వారు నివాసానికి నిరాకరిస్తే వారి నుంచి రద్దు పత్రాన్ని తీసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాలు గుర్తించి ప్రతి వార్డులో ఒక పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్సీ కనకమహాలక్ష్మి, ఎస్ఈ కృష్ణారావు, సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, ఈఈ శ్రీధర్, శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వైఎస్సార్‌సీపీ సమావేశం విజయవంతం చేయాలి

తగరపువలస: భీమిలి ఎస్‌వోఎస్ వద్ద సువేరా బీచ్ రిసార్ట్స్ లో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ భీమిలి జోన్ 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి కోరారు. వార్డు ముఖ్యనాయకులతో సంతపేటలో మంగళవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలో పార్టీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు దిశానిర్దేశం చేస్తారన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, రాష్ట్ర జిల్లా నాయకులు అక్కరమాని మంగరాజు, జీరు వెంకటరెడ్డి, డబ్బీరు ప్రశాంతి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిప్పాడ వెంకటేష్, గుండాసి మధునాయుడు, చిల్ల సూర్యనారాయణరెడ్డి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలి

తగరపువలస: ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు పేరుతో విద్యుత్ బిల్లుల పెంపు, అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ భీమిలి ఏరియా సీపీఐ నాయకులు చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బాదుడే బాదుడు కార్యక్రమం పేరుతో వైఎస్సార్‌సీపీని విమర్శించిన చంద్రబాబు, లోకేష్, పవన్‌లు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ప్రజలకు నష్టం కలిగించే విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసి, పాత మీటర్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక సబ్ స్టేషన్ ఏఈఈ బొట్టా రవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిల్ల నరసింహులు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, మావూరి వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత పఠన పోటీలకు 300 మంది విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫెస్ట్–2025లో భాగంగా మంగళవారం భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహించారు. శ్రీరాధా మదనమోహన మందిరంలో నిర్వహించిన ఈ పోటీలకు చుట్టుపక్కల 25 పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 6న గాత్ర సంగీతం, 7న నాటకాల ప్రదర్శన, 9న వ్యక్తిగత, శాస్త్రీయ నృత్యాలు, 11న కుండలపై పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 99853 64430, 87901 60232 నంబర్లలో సంప్రదించాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస తెలిపారు.


భగవద్గీత పఠన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కరాటేలో ప్రతిభ

భీమునిపట్నం: విశాఖలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో భీమిలికి చెందిన షాడో షోటోకాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇందులో ఎస్.మోక్షజ్ఞ కాటా విభాగంతో రజత పతకం సాధించగా, వి.శశాంక్ కాటా విభాగంలో వెండి పతకం, డి.దిలీప్ కాటా, కుమిటి విభాగాల్లో రజత పతకాలు సాధించారు. వీరిని కరాటే అసోసియేషన్ చీఫ్ కోచ్ ముగడ వెంకటరమణ యాదవ్ అభినందించారు.



అమ్మపాలే బిడ్డకు అమృతం

కొమ్మాది: అమ్మ పాలు అమృతతుల్యమని గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ (జిమ్సర్) ప్రో వీసీ బి.గీతాంజలి అన్నారు. జిమ్సర్ ఆస్పత్రి ప్రాంగణంలో తల్లి పాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లి పాలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయన్నారు. తల్లి పాల సంస్కృతిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. జాతీయ కుటుంబ ఆరోగ్య నివేదిక ప్రకారం విశాఖలో కేవలం 68 శాతం తల్లులు మాత్రమే బిడ్డ పుట్టిన తరువాత మొదటి ఆరు నెలలు పాటు తల్లి పాలు అందిస్తున్నారని తెలిపారు. తల్లిపాలు పోషక పదార్థాలతో నిండి ఉంటాయని, సరైన అవగాహనతో వీటిని అందించడం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో జిమ్సర్ డీన్ ఎస్వీ రావు, డా. వి.బోధిశ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.


తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థి అదృశ్యం


సిగడం నందకిషోర్

పీఎం పాలెం: జీవీఎంసీ ఐదో వార్డులోని గ్లోబ్ స్కూల్ విద్యార్థి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. విజయనగరం జిల్లా డెంకాడ మండలం బొడ్డువలస గ్రామానికి చెందిన సిగడం పాపునాయుడు కుమారుడు నందకిషోర్ (15) గ్లోబ్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతూ, హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 4వ తేదీ సాయంత్రం 6 గంటలకు హాజరు తీసుకుంట న్న సమయంలో నందకిషోర్ స్కూల్లో లేనట్లు గుర్తించారు. స్కూల్ కో– ఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది చుట్టు పక్కల ప్రాంతాల్లో వెదికినా విద్యార్థి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో నందకిషోర్ తల్లిదండ్రులకు విషయం తెలియజేసి, కో–ఆర్డినేటర్ పోలీసులకు ఫిర్యాదు చేశా రు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



రాధా మదనమోహనులకు ఊయల సేవ


ఊయల ఉత్సవంలో రాధా మదనమోహనులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీరాధా మదన్ మోహన మందిరంలో మంగళవారం నుంచి ఊయల ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. బృందావనం సంప్రదాయం ప్రకారం జన్మాష్టమికి ముందు అయిదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలను ఈ నెల 9 వరకు నిర్వహిస్తామని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు. ఈ పండుగలో భాగంగా రాధాకృష్ణుల విగ్రహాలను అందంగా అలంకరించి, ఊయల ఊపుతూ మధురలీలలను స్మరించుకుంటారని తెలియజేశారు. భక్తులు సాయంత్రం 7 గంటల నుంచి ఈ ఊయల సేవను చూసి, తరించాలని కోరారు.

పంచముఖి ఆంజనేయునికి విశేష పూజలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ ఆవరణలోని పంచముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించిన అనంతరం స్వామిని పుష్పమాలలతో అలంకరించారు. సిందూర, నాగవల్లీ దళార్చన నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

